## క్లుప్తంగా

### గంగమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: వలసపాకలలో గంగమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులతో కలసి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి మంగళవారం భూమిపూజ చేశారు. గ్రామస్తుల వినతిమేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి రూ 10 లక్షలు మంజూరు చేసినట్టు గ్రామసర్పంచ్ వాసంశెట్టి రామారావు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, వనుం భాస్కర్, మేడిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను వినియోగించవద్దు



క్లాత్ బ్యాగ్ ఏటీబీని ఆవిష్కరిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించిన నేపథ్యంలో ఇకపై ప్రజలు క్లాత్ బ్యాగ్‌లను మాత్రమే వాడాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తోడ్పడాలని కోరారు. మంగళవారం స్థానిక రైతుబజారులో క్లాత్‌తో రూపొందించిన బ్యాగులను అందించే ఎనీ టైం బ్యాగ్ (ఏటీబీ) వెండింగ్ మెషీన్‌ను ఆయన ప్రారంభించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈ మెషీన్‌ను రైతు బజారులో ఏర్పాటుచేసింది. రూ.10 ధర నిర్ణయించి ఆటోమేటిక్ వెండింగ్ మెషీన్ ద్వారా పొందే అవకాశాన్ని ఏర్పాటు చేశారు. స్కానింగ్ (యూపీఐ) ద్వారా సొమ్ము చెల్లించి ఈ బ్యాగును పొందవచ్చునని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సందీప్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


### యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



సూర్య నమస్కారాలు చేస్తున్న వలసపాకల గ్రామస్తులు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకలపూడికి చెందిన శ్రీ సత్యసాయి ధ్యానమండలి గురూజీ దంగేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో వలసపాకల రామాలయం వద్ద మంగళవారం సూర్య నమస్కారాలు, యోగాసనాలు, వ్యాయామాలు, సమాధి ధ్యానం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి గంటన్నర పాటు నిర్వహించిన ఆసనాలలో స్థానికులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా గురువు సత్యనారాయణ మాట్లాడుతూ యోగ సాధన ద్వారా ఆరోగ్యం లభిస్తుందని, రోజంతా ఉత్సాహంగా ఉంటారన్నారు.

**నౌలి క్రియతో యోగాడే లోగో**



యోగా డే లోగో చూపుతున్న యోగా గురువు సచ్చిదానంద

బోట్‌క్లబ్: అలాగే స్థానిక రామారావుపేటలోని ఆది గురు యోగపీఠానికి చెందిన యోగా గురువు సచ్చిదానంద యోగి తన శరీరంలో నౌలి క్రియా ద్వారా పొట్ట కండరాలను లింగాకారంలో తిప్పుతూ యోగా డే లోగో ఆకృతిని ఏర్పరచి యోగా విశిష్టతను చాటిచెబుతున్నారు.

### అభ్యుదయ కవి 'యాసలపు'

పెద్దాపురం: అభ్యుదయానికి బాటలు వేసిన కవి యాసలపు సూర్యారావు అని సాహితీ విమర్శకులు అద్దేపల్లి ప్రభు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. ప్రజా కవి యాసలపు సూర్యారావు 11వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన కవితా గోష్ఠి నిర్వహించారు. తొలుత సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా అద్దేపల్లి ప్రభు, సూరిబాబు రాజు మాట్లాడుతూ యాసలపు సూర్యారావు సామాజిక అంశాలతో కూడిన అనేక కవితలను పుస్తక రూపంలో సమాజానికి అందించారన్నారు. కార్యక్రమంలో చల్లా విశ్వనాథం, నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు పాల్గొన్నారు.

# జగనన్నతోనే సొంతింటి కల సాకారం

- ఎంపీ వంగా గీత
- 650 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- పాల్గొన్న ద్వారంపూడి, పొన్నాడ సతీష్



ఇంటి పట్టాను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ. పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి



పట్టాల పంపిణీకి హాజరైన లబ్ధిదారులు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అర్హత కలిగిన ప్రతి పేదవాని సొంతింటి కల సాకారం కాగలదని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సుమారు 650 మంది లబ్ధిదారులకు మంగళవారం పటవల గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పొన్నాడ సతీష్ పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు అందజేసి కేటాయించిన స్థలాలను అప్పగింత ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడాలేని విధంగా వేలాది ఎకరాల భూములు కొనుగోలు చేసి మరీ 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత ఏపీ సీఎంకే దక్కుతుందన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు పథకంలో స్థలాలు కేటాయించి అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించి ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు సెంటు స్థలాన్ని కూడా పేదప్రజలకు ఇవ్వలేకపోయాయన్నారు. తమ ప్రభుత్వం ఇస్తుంటే చూసి ఓర్వలేక స్థలాలను శ్మశానాలతో పోలుస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రజలకు మంచి జరిగితే చూడలేని రాజకీయ పార్టీలను తరిమికొట్టాలన్నారు. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం వస్తే తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇచ్చిన స్థలాల్లో చక్కని ఇళ్లు నిర్మించుకుని సార్థకం చేసి చూపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా పేద ప్రజలందరికీ జగన్ ప్రభుత్వం నేనున్నానంటూ భరోసాగా నిలుస్తోందన్నారు. పేదప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సిటీ ఎమ్మెల్యే సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ కాకినాడ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా సీతారామ కల్యాణం



సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో మంగళవారం స్వామి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, భక్తులు పాల్గొన్నారు.

### మండల అభివృద్ధికి అంకురార్పణ జరిగేదిక్కడే!



ఎంపీడీఓ కార్యాలయం బయట పేరుకున్న చెత్త

కరప: ఈ చిత్రం చూసి డంపింగ్ యార్డు అనుకుంటే పొరబడినట్టే. మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ గోడ అవతలి వైపండీ బాబూ. ఒక పక్క అధికారులు స్వచ్ఛత పాటించాలని, చెత్త నుంచి సంపద సృష్టించాలని గగ్గోలు పెడుతుంటే మరో పక్క కొందరు ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ చెత్తకు అటువైపే ఎంపీడీఓ గది ఉండడం గమనార్హం. అంతే కాదు.. ఈ దారి పక్కనే 8 గ్రామాలకు తాగునీరందించే సామూహిక రక్షిత నీటి పథకం చెరువు ఉంది. ఎంపీడీఓ కార్యాలయం పక్కనే మండల విద్యావనరుల కేంద్రం, భవిత కేంద్రం భవనాలు కూడా ఉన్నాయి. ఈ కార్యాలయాలకు వెళ్లేవారు చెత్తను చూసి ఇదేమి చెత్తశుద్ధి అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయం పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి, పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# అద్దె బకాయిలు చెల్లించండి

**కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్**



అద్దె బకాయిలపై సమీక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల అద్దె బకాయిలను వెంటనే వసూలు చేయాలని కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశించారు. మంగళవారం ఆయన మూడు నెలలకు పైబడి దుకాణాల అద్దె బకాయి ఉన్న లీజుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఆర్వోలు పాల్గొన్నారు. జూన్ నెలాఖరు నాటికి నూరుశాతం బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

**వర్షాలపై అప్రమత్తం**

రానున్న వర్షాకాలంలో ఎదురయ్యే ముంపు సమస్యను ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని కమిషనర్ మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, అగ్నిమాపక, పోలీస్‌శాఖలతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలతో ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఎక్కడైనా ముంపు సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురైతే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచి సన్నాహక చర్యలు చేపట్టాలని సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలను ముందుగా గుర్తించి ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టాలన్నారు. బోట్లు, ఇతర సామగ్రిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు ఉన్నారు.

**కెనాల్ అభివృద్ధి పరిశీలన**

కాకినాడ ఇంద్రపాలెం నుంచి సామర్లకోట రోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్ వరకు కెనాల్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల చెప్పారు. ఈ అంశంపై ఆయన మంగళవారం కార్పొరేషన్ అధికారులు, గెయిల్, భాగ్యనగర్ గ్యాస్ కంపెనీకి చెందిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. తూర్పు ఏలేరు డ్రెయిన్, గోదావరి కెనాల్ వైపు తీసుకోవలసిన అభివృద్ధి చర్యలపై కూడా ఆయన చర్చించారు. అంతకు ముందు కాకినాడ వైద్యనగర్‌లోని రీడింగ్ రూమ్‌ను సందర్శించారు.

# ఏఐసీసీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న కమిటీ కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) జిల్లా నూతన కార్యవర్గాన్ని స్థానిక హోటల్‌లో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రిక్కీ గూటం, జనరల్ సెక్రటరీగా స్టీఫెన్ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా సౌమ్య సుమలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆసెర్ స్టాన్‌లీ, జాయింట్ సెక్రటరీగా ఎంఎస్ జోయల్, రికార్డింగ్ సెక్రటరీగా ఎస్.జాన్‌బాబు, ట్రెజరర్‌గా పాల్ రాజ్‌కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా ఎస్‌జె శామ్యూల్, ఉపాధ్యక్షుడిగా రూపస్ కుమార్, వీరితో పాటు వివిధ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర కార్యదర్శి డి.విక్టర్ శామ్యూల్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సభ్యులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించేలా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జహానీ హోలోనెస్ కౌన్సిల్ ఆవిర్భావం, సేవలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. క్రైస్తవ సంఘ నాయకులు శామ్యూల్‌సాగర్, పాపారావు, ఎంఎస్ విలియమ్స్, జాషువా గూటం, కేజీ కుమార్, మోజెస్‌బాబు పాల్గొన్నారు.

# నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయాలి

- ఆర్డీఓ సత్యనారాయణ
- అధికారులతో సమీక్ష



నడకుదురులో రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కరప: శాఖాపరంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసి, ప్రజలకు సేవలందించాలని ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, వీఆర్వోలతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించి సూచనలు ఇచ్చారు. కొత్తగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని అన్నారు. గ్రామ సచివాలయాల్లో అమలుచేస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వేను సకాలంలో పూర్తిచేసి, లబ్దిదారులకు భూహక్కు పత్రాలు అందజేయాలని, ఓటర్ల జాబితాలో తప్పొప్పులు సవరించి, దోష రహిత జాబితా రూపొందించాలన్నారు. అనంతరం ఆర్డీఓ సత్యనారాయణ అధికారులతో కలసి నడకుదురులో పర్యటించి, రీసర్వే పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. తర్వాత గ్రామసచివాలయ భవన నిర్మాణపనులను పరిశీలించి సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, డీటీ కె.అనిల్‌కుమార్, రీసర్వే డీటీ సురేష్, మండల సర్వేయర్ ఈ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచరావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సిగ్నల్ కప్పేస్తే వెళ్లేదెలా!

- జనసైనికుల బాధ్యతా రాహిత్యం
- ట్రాఫిక్ సిగ్నల్‌కు అడ్డంగా ఫ్లెక్సీలు
- ఇబ్బంది పడిన వాహన చోదకులు



సిగ్నల్ లైట్లు కప్పేస్తూ వెలసిన జనసేన ఫ్లెక్సీ

కాకినాడ క్రైం: నగరంలో కీలకమైన నాగమల్లితోట జంక్షన్‌లో అధినేత ప్రాపకం కోసం జనసైనికుల నిర్వాకం ముక్కున వేలేసుకునేలా చేసింది. నిత్యం రద్దీగా ఉండే కూడలిలో వాహనచోదకులను ఇక్కట్లకు గురిచేస్తోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాక సందర్భంగా అనాలోచితంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు ప్రజలకు నానా ఇబ్బందులకు గురిచేశాయి. నాగమల్లితోట జంక్షన్‌లో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మేయర్ సరోజ పేరుతో ఓ భారీ కటౌట్ వెలసింది. ఈ కటౌట్ ఏకంగా సిగ్నల్ లైట్లనే కప్పేయడంతో సర్పవరం నుంచి భానుగుడి వైపు వెళ్లే ప్రయాణికులు సిగ్నల్ లైట్లు కనిపించక నానాయాతన పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీకి, కానిస్టేబుల్ సంజ్ఞలకు అనుగుణంగా వాహనాలు నడుపుతూ తడబడి, పొరబడి జంక్షన్ దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గందరగోళానికి కారణమైన సరోజ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటిని చూసి ఏ చర్యలూ తీసుకోని ట్రాఫిక్ పోలీసులనూ మీరేం చేస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# ఫిజియోథెరపీ పరికరాలు ప్రారంభం

- సామాజిక బాధ్యతగా సమకూర్చిన జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ
- సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపు



ఫిజియోథెరపీ పరికరాల గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ క్రైం: కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో (సీఎస్ఆర్) భాగంగా జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ జీజీహెచ్‌లోని ఫిజియోథెరపీ కేంద్రానికి కీలక పరికరాలు సమకూర్చింది. మంగళవారం ఈ పరికరాలను కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ సంస్థ రూ.3.25 లక్షలు విలువైన అధునాతన పరికర సంపత్తిని సమకూర్చిందనీ, రోగులు వీటి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేట్ సంస్థలు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిచేందుకు తమ వంతు సాయం అందించాలని కలెక్టర్ కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ పుష్కరరావు, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవోలు డాక్టర్ రాహుల్, డాక్టర్ యమున, ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనాథ్‌తో పాటు ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ వైద్యులు పాల్గొన్నారు.

# బహుదూర విద్య

- మూతపడ్డ ఏయూ దూరవిద్యా కేంద్రం
- 40 ఏళ్లుగా ఎందరో విద్యార్థులకు సేవలు
- ఆన్‌లైన్‌లో అందుబాటులో కార్యకలాపాలు





మూతపడ్డ ఏయూ దూరవిద్యా కేంద్రం

**బాలాజీచెరువు: విద్యా సంవత్సరంలో జూన్ నెల వస్తే చాలు పీఆర్ డిగ్రీ కళాశాలలోని ఏయూ దూరవిద్యాకేంద్రం విద్యార్థులతో కళకళ లాడేది.** నేడు ఏ సందడి లేక కళావిహీనంగా మారింది. ఏ విద్యార్హతల లేకుండా 18 ఏళ్లు నిండిన వారు డిగ్రీ, పీజీ డిప్లమో చేయాలనుకునే వారికి ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం అడ్మిషన్లు కల్పిస్తోంది. విశాఖలోని ఆంధ్రాయూనివర్సిటీ దూర విద్యా కేంద్రం ఆధీనంలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1972 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మూసివేయడంతో అడ్మిషన్ కోసమో లేదా పరీక్షల ఫీజు దరఖాస్తుల స్వీకరణ, హాల్‌టికెట్ల జారీ, పరీక్ష కేంద్రం వివరాల వంటి సమాచారం చెప్పడానికి అవకాశం లేకుండాపోయింది. ఈ కేంద్రం ద్వారా ఏటా జారీ చేసే నోటిఫికేషన్ల ద్వారా మే, జూన్ నెలల్లో డిగ్రీ విభాగాల్లో 4 వేల మంది, పీజీ విభాగంలో 1500 మంది అడ్మిషన్లు పొందేవారు. వీరందరికీ సమాచారం కోసం ఈ స్టడీసెంటర్ ఏర్పాటుచేసి ముగ్గురు సిబ్బందిని ఏర్పాటు చేసి సేవలు అందించేవారు. వీరిని విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా తక్కువ విద్యార్హతతో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారు పదోన్నతి కోసం ఈ స్టడీ సెంటర్లను అత్యధికంగా ఆశ్రయించేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి దీనిని మూసివేయడంతో వారంతా కొంత శ్రమపడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దూరవిద్యను అభ్యసించాలనుకునే వారు ఈ కేంద్రాన్ని తెరవాలని కోరుతున్నారు.

**సేవలు యథాతథం**



స్టడీసెంటర్ సేవలన్నీ ఆన్‌లైన్‌లో ఉండటంతో ఈ కేంద్రాన్ని తొలగించారు. పరీక్ష ఫీజు, అడ్మిషన్లు అన్ని ఏయూ వెబ్‌సైట్‌లో ఉండడంతో పాటు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటుచేసి సమాచారం అందజేస్తున్నారు. అలాగే స్టడీ సెంటర్లు ప్రభుత్వ కళాశాలలో ఉన్న నేపథ్యంలో ప్రిన్సిపాల్స్‌ను కో-ఆర్డినేటర్‌గా నియమించి సమాచారం చెప్పాలని సూచించాం.

– కె.విశ్వేశ్వరరావు, స్టడీసెంటర్ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, విశాఖపట్నం

### అర్జీల పరిష్కారానికి మండల కమిటీల ఏర్పాటు

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఒకటి కన్నా ఎక్కువ సమస్యలపై ప్రజలు దాఖలు చేసిన అర్జీల పరిష్కారానికి మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులతో కలిసి కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ ప్రతి సోమవారం ఉదయం సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై వారి దృష్టికి వచ్చిన ఫిర్యాదుల విషయమై చర్చించి, అవసరమైతే సంయుక్తంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో శ్రీధర్‌రెడ్డి కోరారు.

### పారిశుధ్య పనుల తనిఖీ

**ఇద్దరికి షోకాజ్ నోటీసులు**

కాకినాడ: పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వంపై నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన సీటీఓ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, సిద్ధార్థ నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పలుచోట్ల చెత్త తొలగింపులో నిర్లక్ష్యాన్ని గుర్తించి సిబ్బందిపై మండిపడ్డారు. ఇందుకు కారణమైన శానిటరీ సెక్రటరీ, మేస్త్రీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంహెచ్‌ఓను ఆదేశించారు. ప్రజలు కూడా చెత్తను రోడ్లుపైన, డ్రైనేజీలలో వేయకుండా ఇంటికి వచ్చే సిబ్బందికి మాత్రమే అందించాలని కోరారు. ప్రజల సహకారం ఉన్నప్పుడే మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ చేయగలమన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమత్తుల దృష్ట్యా బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జగన్నాధపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని నరసింహ రోడ్డు, ఏసు వారి వీధి, చిన మార్కెట్ వీధి, విష్ణాలయం వీధి, గుడిమెట్ల వారి వీధి, చర్చి స్క్వేర్, జగన్నాధపురం పాత వంతెన, వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### మానసిక వికాసానికి క్రీడలు దోహదం

సామర్లకోట: విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ అన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ బాలుర టీమ్ ఎంపిక నిమిత్తం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. ఈ నెల 23 నుంచి గుంటూరులో జరిగే అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు విజయం సాధించాలన్నారు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మర్ బాస్కెట్ బాల్ శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కాకినాడ జిల్లా బాస్కెట్‌బాల్ టీమ్‌కు సీహెచ్ ప్రసన్నాంజనేయులు, సీహెచ్ కిరణ్‌రాజ్, జి.రవికుమార్, జి.రామయ్యరాజు, జి.మోహన్ తేజ, కె.మణికంఠ, ఎ.నీరజ్‌శ్రీ,, కె.అర్జున్, సీహెచ్ నాగరాజు, కె.శామ్యూల్, సీహెచ్ వెంకటేష్‌లు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి కొండలరావు, కార్యదర్శి బండే కృష్ణార్జున్, ఉపాధ్యక్షుడు టీపీఎస్ రంగారావు, సహాయ కార్యదర్శి చెక్కా శేషగిరి, కనకాల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయనకు ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహనరావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు తదితరులున్నారు.